సీసీ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక ఈద్గా కాలనీలో రూ.37 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బొర్రా సత్యవతి, సర్పంచి మసిముక్కు మారుతీప్రసన్న వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ డిఎన్‌ఆర్



ఎన్నికల గ్యాస్..!

- వంటగ్యాస్ ధర రూ.వంద తగ్గిస్తూ ప్రకటన
- రూ.410 ఉన్న సిలిండర్ ధర రూ.1130కు పెంచిన మోడీ సర్కార్
- ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో రూ.200 తగ్గింపు
- సాధారణ ఎన్నికల ముందు మరోసారి రూ.వంద తగ్గింపు
- ఇప్పటికీ 14.2 కిలోల సిలిండర్ ధర రూ.800పైనే
- మిగిలిన భారం సంగతేమిటంటున్న మహిళలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వంటగ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు ఎన్నికల స్టంట్‌గా మారిపోయింది. ఎన్నికల సమయంలో సిలిండర్ ధర తగ్గించినట్లు ప్రకటించి సామాన్య ప్రజానీకాన్ని ఏమార్చేందుకు మోడీ సర్కార్ కొత్త జిమ్మిక్కులకు దిగింది. 2014 ఎన్నికల అనంతరం మోడీ సర్కార్ అధికారం చేపట్టే నాటికి వంటగ్యాస్ సిలిండర్ ధర ఎంత ఉంది. తర్వాత ఏస్థాయికి పెంచారు. తర్వాత ఎంత తగ్గించారో తెలుసుకుంటే మోడీ సర్కార్ జనాన్ని ఏవిధంగా మోసగిస్తుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చేసరికి 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.410గా ఉంది. వంటగ్యాస్ ధరను భారీగా పెంచుతూ మోడీ సర్కార్ రూ.1130కు తీసుకెళ్లింది. అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చే గ్యాస్ సబ్సిడీని సైతం నిలిపివేసింది. కొంతమందికి సబ్సిడీ సొమ్ము రూ.15 నుంచి రూ.20లోపే జమవుతుండటం గమనార్హం. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎనిమిది లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వంటగ్యాస్ ధర భారీగా పెరగడంతో సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రతినెలా ఆదాయంలో రూ.వెయ్యికిపైగా గ్యాస్ సిలిండర్‌కు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇక పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజానీకం బతుకు కష్టతరంగా మారింది. జనాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో మోడీ సర్కార్ ఎన్నికల ముందు సర్దుబాటుకు దిగింది. 2023లో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా ఆగస్టు 29న గ్యాస్ సిలిండర్ ధరను రూ.200 తగ్గించినట్లు ప్రకటించింది. దీంతో సిలిండర్ ధర రూ.910కి తగ్గింది. పెంచిందెంత.. తగ్గించిందెంత అనే విమర్శలు సైతం వెల్లువెత్తాయి. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ మరో నాలుగైదు రోజుల్లో రానుండటంతో సిలిండర్ ధరను మరో రూ.వంద తగ్గిస్తున్నట్లు మోడీ సర్కార్ ప్రకటించింది. దీన్ని మహిళా దినోత్సవ కానుకగా మోడీ ప్రకటించడం మరింత విడ్డూరంగా ఉంది. సిలిండర్ ధర రూ.1100కుపైగా పెంచినప్పుడు గుర్తుకు రాని మహిళలు, తగ్గించినప్పుడు గుర్తుకు రావడం ఏమిటో తెలియడం లేదు. ఇప్పటికీ గ్యాస్ సిలిండర్ రూ.810 వరకూ పలుకుతోంది. అంటే భారీగా పెంచి కొద్దిగా తగ్గించి జనాన్ని ఉద్ధరించినట్లు మోడీసర్కార్ చేస్తున్న ప్రచారం చూసి అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అమాయకులని, తాము ఏం చెబితే అది నమ్ముతారనే భావనలో మోడీ పరివారం ఉన్నట్లు కన్పిస్తోంది. గ్యాస్ ధరతోపాటు పెట్రోల్, డీజిల్, పప్పుల ధరల పెరుగుదల సామాన్య ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని మోడీ సర్కార్ మరిచిపోయినట్లు భావిస్తోంది. వంటగ్యాస్ ధర తగ్గుదల అంతా ఎన్నికల గ్యాస్ అంటూ జనాల్లో తీవ్రమైన చర్చ నడుస్తోంది. ఎన్నికలు పూర్తయిన తర్వాత మళ్లీ వంటగ్యాస్ ధరను పెంచే అవకాశం ఉందని జనం భావిస్తున్నారు.

చంద్రబాబు బుజ్జగింపులు..!

జిల్లాలో జనసేనకు కేటాయించిన స్థానాలపై స్పష్టత

టిక్కెట్ ఆశించిన టిడిపి అభ్యర్థులతో చంద్రబాబు సమావేశం

పొత్తులో భాగంగా ప్రకటించిన అభ్యర్థికి సహకరించాలని దిశానిర్దేశం

అధికారంలోకొచ్చాక న్యాయం చేస్తామని హామీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జనసేనకు కేటాయించిన స్థానాల్లో టిడిపి టిక్కెట్ ఆశించిన అభ్యర్థులను చంద్రబాబు బుజ్జగించే ప్రక్రియ చేపట్టారు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపునకు టిడిపి నాయకత్వం పని చేయాలని శుక్రవారం దిశానిర్దేశం చేశారు. దీంతో పొత్తులో భాగంగా జిల్లాలో జనసేనకు కేటాయించిన స్థానాలపై కొంత స్పష్టత వచ్చింది. జనసేనకు ఉంగుటూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, పోలవరం, భీమవరం స్థానాలను కేటాయించినట్లు ప్రచారం సాగుతోంది. ఉంగుటూరు టిక్కెట్ జనసేనకు కేటాయించినట్లు తెలియడంతో టిడిపి టిక్కెట్ ఆశించిన మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు గురువారం తీవ్రస్థాయిలో మండిపడిన సంగతి తెలిసిందే. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పెద్దఎత్తున హడావుడి చేశారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ అసంతృప్తి జ్వాలలు రేగుతుండటంతో టిడిపి అధినేత చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగారు. సీటు దక్కని అసంతృప్త నేతలను బుజ్జగించే పని చేపట్టారు. అందులో భాగంగా ఉంగుటూరు టిక్కెట్ ఆశించిన గన్ని వీరాంజనేయులు, నరసాపురం టిక్కెట్ ఆశిస్తున్న పొత్తూరి రామరాజు, పోలవరం టిక్కెట్ రేసులో ఉన్న బొరగం శ్రీనివాస్, తాడేపల్లిగూడెం టిక్కెట్ ఆశిస్తున్న వలవల బాబ్జీతో చంద్రబాబు నేరుగా మాట్లాడారు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన స్థానాల్లో మీరంతా సహకరించాలని కోరారు. పార్టీ అధికారంలోకొచ్చాక అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో జిల్లాలో ఏయే స్థానాలు జనసేనకు కేటాయించారో అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ చంద్రబాబు సమావేశంతో స్పష్టత వచ్చింది. భీమవరం స్థానంలోనూ జనసేన పోటీ చేయనున్నట్లు ఇప్పటికే స్పష్టత వచ్చింది. మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు జనసేనలో చేరి భీమవరం నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం జరిగిన జనసేన సభకు ఆయన హాజరు కావడం అందుకు మరింత ఊతమిచ్చింది. పొత్తులో భాగంగా టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు మున్ముందు ఏవిధంగా సహకరించుకుంటారో వేచిచూడాలి.

ఇప్పుడే వచ్చేస్తామన్నారు.. మృత్యువాత పడ్డారు

రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ముగ్గురు దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు

శివరాత్రి వేళ శోకసంద్రమైన ఆచంట, పండితవల్లూరు

మృతులు అభిరామ్, ఆనంద్, దుర్గారావు (ఫైల్ ఫొటోలు)

ప్రజాశక్తి - ఆచంట

'ఇప్పుడే వచ్చేస్తామంటూ బయటికెళ్లి రాత్రి 11 దాటినా ఇంకా రాలేదేమిటీ.. శివరాత్రి ఉత్సవాలు చూసొస్తామని వెళ్లినోళ్లు అర్ధరాత్రి అవుతున్నా రాకుండా ఎక్కడున్నారో' అని ఎదురుచూస్తున్న ఆయా కుటుంబాలకు ఆచంట-మార్టేరు రోడ్డులో కొఠాలపర్రు వంతెనపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం తీరని శోకం మిగిల్చింది. మూడు కుటుంబాలకు జీవనాధారాన్ని చిదిమేసింది. ఆచంట - మార్టేరు ఆర్‌అండ్‌బి రహదారిపై కొఠాలపర్రు వంతెన వద్ద గురువారం అర్ధరాత్రి రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఆచంట ఎస్‌ఐ రాజకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆచంట పంచాయతీ పరిధిలోని గొల్లపల్లివారి చెరువుకు చెందిన రొక్కాల అభిరామ్ (22), పెదపేటకు చెందిన చదలవాడ ఆనంద్ (22) ఇరువురు స్నేహితులు. వీరు గురువారం రాత్రి పనిపై తూర్పుపాలెం వెళ్లి ఆచంట బయల్దేరారు. పోడూరు మండలం పండితవల్లూరు పంచాయతీ పరిధిలోని అశోక్‌నగర్‌కు చెందిన చుక్క దుర్గారావు (29), లక్ష్మీ చెరువు గట్టుకు చెందిన పితాని సాయి ఇరువురు స్నేహితులు. ఆచంటలో శివ రాత్రి ఉత్సవాలు చూసేందుకు వెళ్లి పండితవల్లూరు తిరుగు పయనమయ్యారు. గురువారం రాత్రి సుమారు 11.45 గంటల ప్రాంతంలో కొఠాలపర్రు వంతెనపైకి వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దుర్గారావు, ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందగా అభిరామ్‌ను 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన పితాని సాయి పాలకొల్లులోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

శోకసంద్రమైన ఆచంట, పండివల్లూరు

రొక్కాల అభిరామ్, చదలవాడ ఆనంద్ ప్రయివేటు ఎలక్ట్రీషియన్లుగా పని చేస్తుంటారు. వీరి తల్లులు ఉపాధి నిమిత్తం ఇటీవలే గల్ఫ్ దేశాలకు వెళ్లారు. వీరిద్దరు అవివాహితులు. ఈ కుటుంబాలకు వీరే జీవనాధారం. పండితవల్లూరుకు చెందిన చొక్కా దుర్గారావుకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. దీంతో ఆ మూడు కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. శివరాత్రి ఉత్సవాల సమయంలో జరిగిన ప్రమాదంతో ఆచంటలోనూ, పండితవల్లూరులోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలకు పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఏలూరులో రాష్ట్రస్థాయి సెమినార్

పర్స శత జయంతి సందర్భంగా

ప్రజాశక్తి - ఏలూరు

సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు, కీర్తిశేషులు పర్స సత్యనారాయణ శతజయంతి సందర్భంగా ఈ నెల 9న ఏలూరులో రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం పది గంటలకు ఏలూరు కోటదిబ్బలోని సీతారామభర్తియా కళ్యాణ మండపంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మంతెన సీతారాం సెమినార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. లౌకికరాజ్యం-మతోన్మాద ప్రమాదం అనే అంశంపై పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర కార్మికోద్యమం-సిఐటియు పాత్ర అనే అంశంపై సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు-కార్మికవర్గ కర్తవ్యం అనే అంశంపై సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు.

అత్యాచారాలు అరికట్టకుండా వేడుకలేమిటీ

ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహిళలపై అత్యాచారాలు అరికట్టకుండా ప్రభుత్వాలు నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకలకు అర్థం లేదని ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏలూరు టైటాస్ నగర్‌లో శుక్రవారం సాయంత్రం మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యు.భారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైమావతి మాట్లాడుతూ మన దేశంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక మహిళపై అత్యాచారం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు ప్రతియేటా మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల అభివృద్ధికి కృషి చేస్తామని గొప్పలు చెబుతూనే ఉంటారని, దేశంలో చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, అకృత్యాలకు మాత్రం అడ్డుకట్ట వేయడం లేదని విమర్శించారు. ఇంటర్‌నెట్, సినిమాల్లో అశ్లీలత, హింసను అరికట్టాలని డిమాండ్ చేశారు. మద్యం, డ్రగ్స్ మత్తు పదార్థాలు అరికట్టాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బిజెపి ప్రభుత్వం హడావిడిగా 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించి 2029 నుంచి అమలు అనడం దారుణమని విమర్శించారు. సిఐటియు నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల మహిళలపై రోజురోజుకీ దాడులు పెరుగుతున్నాయని, చిన్నారులు, మహిళల కేసులు విచారించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షులు కె.ప్రభావతి మాట్లాడుతూ గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్‌ఐ నగర అధ్యక్షులు పి.దుర్గాప్రసాద్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఠాగూర్‌రాజా సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పద్మలీల, రజిని, మంగమ్మ, మౌనిక, సుమతి, అనసూయ, నాగమణి పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న ఐద్వా నేతలు

పోలవరం : పట్టిసీమలో ఇసుక తిన్నెలపై సేదతీరుతున్న యాత్రికులు

పోలవరం : పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయంలో క్యూలైన్‌లో ఉన్న యాత్రికులు

పట్టిసీమ.. యాత్రికులతో కిటకిట

శివక్షేత్రాన్ని దర్శించుకున్న 1.50 లక్షల మంది

అన్ని శాఖల సమన్వయంతో ఇబ్బందుల్లేకుండా చర్యలు

పలువురు దాతల అన్నదాన కార్యక్రమాలు

ప్రజాశక్తి - పోలవరం

మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టిసీమ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయం యాత్రికులతో కిటకిటలాడింది. శుక్రవారం రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 1.50 లక్షల మంది యాత్రికులు పట్టిసీమ శివ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచే పట్టిసీమ శివ క్షేత్రానికి యాత్రికుల తాకిడి ఎక్కువైంది. గురువారం రాత్రికే పట్టిసీమ శివ క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఇసుక తెన్నెల్లో అధికారులు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సేదతీరి, ఉదయం గోదావరి నదిలో స్నానాలు చేసి పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. నూతన దంపతులు చలిగంగ స్నానాలు ఆచరించారు. దేవాదాయ రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, మత్స్యశాఖ, ఎపి టూరిజం, విపత్తుల శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా పంచాయతీ శాఖ, అటవీ శాఖ, పౌరసరఫరా శాఖాధికారులు పరస్పర సహాయ సహకారాలతో యాత్రికులకు ఎలాంటి లోటు పాట్లు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. పట్టిసీమకు వచ్చే భక్తులకు గోదావరి నదికి ఇరువైపులా పలువురు దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కన్నాపురం అడ్డరోడ్డు వద్ద జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన దాతలు అన్నదానం నిర్వహించగా, పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద హుకుంపేట జమీందారు హెూతా వీరభద్రయ్య అన్నదాన సత్రంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆ ప్రాంతానికి సమీపంలో సత్యసాయి సేవా సంస్థలు కూడా అన్నదానం నిర్వహించారు. గోదావరి నది ఇసుక తిన్నెలో రాజమహేంద్రవరం కొవ్వూరు నుంచి వచ్చిన దాతలు చేపట్టిన పంచభక్ష పరమాన్నాలు భక్తులను ఎంతగానో అలరించాయి. అదే ప్రాంతంలో పోలవరం కొణతాల బ్రదర్స్, వింజరం మాస్టారు బ్రాహ్మణ అన్నదాన సత్రం, మండవల్లి నాగ వీరభద్రరావు ఆర్యవైశ్య అన్నదాన సత్రం వేలాదిమంది యాత్రికుల ఆకలిని తీర్చాయి. ఇసుక తిన్నెల్లో రాకపోకలు సాగించేవారికి శుక్రవారం తపన చౌదరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు మజ్జిగ, పెరుగు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. 40 వేల మజ్జిగ ప్యాకెట్లు, 40 వేల పెరుగు ప్యాకెట్లు, 80 వేల వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బిజెపి రాష్ట్ర మహిళా కార్యవర్గ సభ్యురాలు భార్గవ్ వెంకటలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కరిబండి నాగరాజు, జిల్లా నాయకులు, పలువురు దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్న అధికారులు

పట్టిసీమ శివక్షేత్రాన్ని దర్శించుకున్న మంత్రి వనిత

పట్టిసీమ శివక్షేత్రాన్ని మంత్రి తానేటి వనిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం పట్టిసీమ మహాశివుని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో దర్శించుకున్నట్లు చెప్పారు. శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలంతా కలిసి పరమేశుని దర్శించుకున్నారన్నారు. యాత్రికులకు ఎలాంటి లోటుపాట్లు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారని అధికారులను అభినందించారు.

బలివేకు లక్ష మందికి పైగా యాత్రికులు

ముసునూరు : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని బలివే గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కళ్యాణం రోజున సుమారు లక్ష మందికి పైగా యాత్రికులు వచ్చారని ఆలయాధికారి నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు తమ్మిలేరు స్నానాలు (జల్లు స్నానాలు) చేసి స్వామివారిని దర్శించుకున్నారు. నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి, నూజివీడు టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారధి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీపూజ, నూజివీడు సివిల్ కోర్టు జడ్జి శైలజలు విఐపి దర్శనం చేసుకునే సమయంలో సామాన్య భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, ఎంపిడిఒ, పలు శాఖాధికారులు తమ సిబ్బందితో కలిసి యాత్రికులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఉత్సవాల్లో కుసుమహార సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, తాగునీరు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కొలుసు పార్థసారధి చక్కెరపొంగలి, పులిహోర, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తపన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పులిహోర దద్దోజనం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సత్య సాయి సేవా సంస్థ వారు తాగునీరు పంపిణీ చేశారు. తమ్మిలేరు జల్లు స్నానాల వద్ద భక్తులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


బలివే తమ్మిలేరు వద్ద జల్లు స్నానాలు చేస్తున్న యాత్రికులు

నూకరాజు సేవలు ఆదర్శప్రాయం

మానస ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్

ప్రజాశక్తి - భీమడోలు

ఉద్యోగ విరమణ అనంతరం ఉపాధ్యాయిని గుళ్ల నూకరాజు అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని మానస ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆ పాఠశాలలో శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం గుళ్ల నూకరాజును సత్కరించింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ నూకరాజు ఉపాధ్యాయినిగా వివిధ పాఠశాలల్లో పని చేశారన్నారు. వీరికి సహ ఉపాధ్యాయులుగా ఆమె భర్త అప్పారావు పని చేస్తూ ఆ సమయంలో ఆమె చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారన్నారు. వీరి వద్ద చదువుకున్న పలువురు విద్యార్థులు దేశ, విదేశాల్లో వివిధ హోదాల్లో ఉన్నతస్థాయిలో కొనసాగుతున్నారని తెలిపారు. ఆ సమయంలోనే మండలస్థాయిలో శాంతి సంఘాల సభ్యురాలిగా, పోలీస్ స్టేషన్లో కుటుంబ గొడవలు సర్దుబాటు చేసే కౌన్సెలింగ్ కమిటీ సభ్యులుగా పని చేశారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం భీమడోలులో విశ్రాంత ఉద్యోగులు నిర్మించిన విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయం నిర్మాణం సందర్భంగా తమ వంతు సహాయ సహకారాలు అందజేశారని తెలిపారు. వీరి పిల్లలు విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడినప్పటికీ సేవా కార్యక్రమాలు కొనసాగించాలనే లక్ష్యంతో వీరు భీమడోలులోనే స్థిరపడ్డారన్నారు. ప్రస్తుతం మానవత భీమడోలు శాఖ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారని, మానవత కార్యాలయ భవనం నిర్మాణంలో భాగస్వాములయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలను సత్కరిస్తున్న రవీంద్రకుమార్

ప్రభుత్వాల విధానాలతో రైతులకు తీరనినష్టం

ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఒకవైపు కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతులు నష్టపోతున్నారని, మరోవైపు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ సమావేశం తీవ్రంగా విమర్శించింది. శుక్రవారం స్థానిక అన్నే భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం ముందుకు సాగలేదన్నారు. ఎర్ర కాలువ జలాశయం, కొవ్వాడ జలాశయం, తాడిపూడి ఎత్తిపోతలు తదితర సాగునీటి ప్రాజెక్టుల పరిధిని పెంచి మరింత ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గోదావరి, కృష్ణా డెల్టాలకు ఏలూరు జిల్లా శివారు ప్రాంతం కావడంతో కాలువల ఆధునికీకరణ చర్యలు చేపట్టకపోవడం వల్ల సాగునీరందక రైతులు పంటలు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సాగునీటి వనరులపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఆయిల్‌పామ్, మిర్చి, అరటి, వర్జీనియా పొగాకు, కొబ్బరి తదితర పంటలకు కనీస ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌పామ్ టన్ను గెలలకు రూ.18 వేలు ధర ఇవ్వాలని కోరారు. పెదవేగి మండలం విజయరాయిలో నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూనిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. రైతులకు నష్టం కలిగించే భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు కట్టా భాస్కరరావు, కె.అప్పారావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, గంటా పాపారావు, బొప్పుడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి వనిత పరామర్శ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని దొరసానిపాడులో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బుసనబోయిన సత్యనారాయణ కుటుంబాన్ని మంత్రి తానేటి వనిత శుక్రవారం పరామర్శించారు. కరోనా కాలంలో ఆయన మరణించడంతో కుటుంబసభ్యులను పరామర్శించి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిష్టాత్మకమైన గ్రహంబెల్ అవార్డును అందుకున్న సత్యనారాయణ కుమార్తె పావనిని అభినందించారు. ఆ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని మంత్రి వనిత హామీ ఇచ్చారు.

చిన్నారులను సుకన్య పథకంలో చేర్చిన స్నేహితులు

ఇద్దరు స్నేహితుల సేవా దృక్పథం

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో పేద, బడుగు, బలహీనులకు ఇద్దరు స్నేహితులు అండగా నిలిచారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామానికి చెందిన ఇద్దరు స్నేహితులు మానికల గంగాధరరావు, పాకనాటి సీతారామ్ 20 మంది పిల్లలకు సుకన్య స్కీమ్ కింద రూ.ఐదు వేలు డిపాజిట్ చేసి వారి వారి వ్యక్తిగత పేర్లు మీద ముసునూరు పోస్టాఫీస్ ఖాతా తెరిపించారు. మిగతా పిల్లల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మహిళాభ్యున్నతికి కృషి : టిడిపి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మహిళల అభ్యున్నతి, స్త్రీ సాధికారతే లక్ష్యంగా టిడిపి, జనసేన కూటమి కలలకు రెక్కలు అనే సరికొత్త పథకన్ని తీసుకొస్తున్నామని టిడిపి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి తెలిపారు. స్థానికంగా శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రాష్ట్ర పాలన సాగుతుందన్నారు. ఈ రాక్షసపాలనను రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి నిర్వీర్యం చేస్తుందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే మహిళల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తామన్నారు. చదువుకు సంబంధించి డబ్బు కొరత లేకుండా, మహిళలకు వృత్తి పరమైన విద్యా మార్గాలను అందించడంతో పాటు వారికిఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఇంటర్ పూర్తి చేసిన మహిళలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకానికి నమోదు చేసుకున్న మహిళలు తీసుకునే బ్యాంక్ లోన్‌కు తమ ప్రభుత్వం బాధ్యత వహిస్తుందన్నారు. ఈ పథకంలో భాగంగా కోర్సుల కోసం తీసుకున్న డబ్బుకు వడ్డీ పూర్తి బాధ్యత ప్రభుత్వం వహిస్తుందన్నారు. దేశంలో ఎక్కడైనా కోర్స్‌లను అభ్యసించవచ్చన్నారు. మహిళలు kalalakurekkalu.com వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ లింక్ కోసం 9261292612కు మిస్డ్ కాల్ ఇవ్వాలని తెలిపారు.

శివాలయాలకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని తాడువాయిలో శివరాత్రి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచి శివాలయానికి యాత్రికులు పోటెత్తారు. జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబసు మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా తమ సిబ్బందిని పహారా పెట్టామని తెలిపారు. జంగారెడ్డిగూడెం సిఐ రాజేష్ ఆలయం వద్ద భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ లక్ష్మణ్‌రావు, జంగారెడ్డిగూడెం సిఐ రాజేష్, తాడువాయి సర్పంచి, జంగారెడ్డిగూడెం తహశీల్దార్ స్లీవ్‌జోజి, ఆలయ కమిటీ సభ్యులు యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. తాగునీటి సౌకర్యం, ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. తాడువాయి హైస్కూల్ విద్యార్థులు స్కౌట్స్, గైడ్స్‌గా వ్యవహరించారు.

ఆగిరిపల్లి : శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారు జామునుంచే మండల పరిధిలోని పలు శివాలయాలకు యాత్రికులు చేరుకున్నారు. శోభనాచల స్వామి కొండపై దుర్గా పార్వతి సమేత మల్లికార్జున స్వామి, ఆగిరిపల్లిలోని మెయిన్ సెంటర్‌లో గంగా అన్నపూర్ణ సమేత ముక్తేశ్వరస్వామి, వరహాపుష్కరిణి సమీపంలోని బాలాత్రిపుర సుందరీ సమేత ముక్తేశ్వర స్వామి, సూరవరంలోని గంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి, కనసానపల్లిలోని శ్రీ బాలాత్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాలకు పెద్ద ఎత్తున యాత్రికులు పోటెత్తారు.

చాట్రాయి : మహాశివరాత్రిని పురస్కరించుకుని చాట్రాయిలో ఉన్న పురాతన శివాలయం శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామునే భక్తులు వేలాదిగా చేరుకున్నారు. యాత్రికులందరికీ ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అగ్రహారంలో శ్రీ వైకుంఠ ఆశ్రమంలో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ సభ్యులు యనమదల రామ్మోహన్‌రావు, చల్లగొల్ల వెంకట్ రాములు మాట్లాడారు. ప్రతి ఏడాది మహాశివరాత్రికి యజ్ఞాలు, హోమాలు, అన్నదానాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

కలిదిండి : స్థానిక శ్రీ పాతాళ భోగేశ్వర స్వామి వారిని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ఇఒ శింగనపల్లి శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఆయనకు సాదార స్వాగతం పలికారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

ముదినేపల్లి : మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం శివాలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. మండలంలోని గురజ, వడాలి, సింగరాయపాలెం, ఉప్పరగూడెం, పెదపాలపర్రు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మద్ది శేషుబాబు (60) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నెల నాలుగో తేదీన విధులు ముగించుకుని కైకరం నుండి తాడేపల్లిగూడెంలోని ఇంటికి బైక్‌పై వెళ్తుండగా ఆటోను ఢీ కొని ప్రమాదానికి గురయ్యారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో రాజమండ్రిలోని ఓ ప్రయివేట్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది, సర్పంచి సంతాపం వ్యక్తం చేశారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

టిప్పర్ ఢీ కొని వ్యక్తి తీవ్ర గాయాపాలైన ఘటన మండలంలోని పెదపాలపర్రు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెయ్యేరు గ్రామానికి చెందిన మన్నే వెంకటేశ్వరరావు(కొండ) గుడివాడ నుంచి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో ముదినేపల్లి వైపు నుండి గుడివాడ వెళ్తున్న టిప్పర్ బైక్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వరరావును కుటుంబసభ్యులు విజయవాడలోని ఆసుపత్రికి తరలించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.అంకంపాలెం గ్రామ శివారులో కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ టి.రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... పి.అంకంపాలెం గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.వెయ్యి నగదు, ఒక కోడిపుంజు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. ఆరుగురిని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మహిళా సాధికారతకు కృషి చేయాలి

ఎంబివికె సభ్యురాలు స్వరూపరాణి

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళా సాధికారత కోసం సమాజం దీక్ష పూనాలని విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం సభ్యురాలు కె.స్వరూపరాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైఎంహెచ్‌ఎ హాలులో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపూరి బాలోత్సవం సంయుక్తంగా సదస్సు, కళా నీరాజనం, 55 మంది మహిళలకు అభినందన సత్కారాలు నిర్వహించారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు జి.శారద స్వాగతం పలికారు. అడుసుమిల్లి నిర్మల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కె.స్వరూపరాణి మాట్లాడుతూ 1910లో డెన్మార్క్ రాజధాని కొపెన్ హీజెన్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు మహిళా సభలో క్లారాజెట్కిన్ పెట్టిన తీర్మానం కారణంగా అమల్లోకి వచ్చిందన్నారు. శ్రామిక మహిళా దినోత్సవంగా మహిళా దినోత్సవం రోజుకు ఎనిమిది గంటల పని, సమాన పనికి సమాన వేతనం, యుద్ధాలు వద్దంటూ మొదలైందన్నారు. 1975 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం అయిందన్నారు. నేడు దేశంలో మహిళలపై నిరంతరం సాగుతున్న అత్యాచారాలు, హత్యలు ఆగాలంటే చట్టాలు కఠినంగా అమలు చేయడంతో పాటు పురుషులను పక్కదారి పట్టిస్తున్న సంస్కృతిని సాంప్రదాయాలను వ్యతిరేకించాలన్నారు. చట్ట సభల్లో 33 శాతం సీట్లు కేటాయించే చట్టం సక్రమంగా అమలు చేయాల్సి ఉందన్నారు. సభాధ్యక్షురాలు అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ విజ్ఞానవంతమైన సమాజం కోసం ప్రయత్నిస్తునామని, అందులో భాగంగా మహిళలు, కాలేజీ విద్యార్థులకు మహిళా దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు. హేలాపురి బాలోత్సవం ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతితోనే సమాజ మార్పు సాధ్యమన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహరావు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం పాటుపడిన రాజా రామ్మోహనరాయ్, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో నేటికీ కొనసాగుతున్న సమస్యలపై పురుషులు కృషి చేయాలని కోరారు. అనంతరం ఏలూరు నగరంలో సేవా సంస్థలు, సంఘాల్లో చురుకుగా పనిచేస్తున్న, అభ్యుదయ భావాలతో సంఘాల్లో పని చేస్తున్న, విద్యారంగంలో భావిపౌరులను తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్న వారిలో ఎంపిక చేసిన 55 మంది మహిళలకు అభినందన సత్కారం చేశారు. ఈ సదస్సు సందర్భంగా నిర్వహించిన చిత్ర లేఖనం, ఉపన్యాస పోటీలు, సర్‌సిఆర్‌రెడ్డి పాలిటెక్నిక్, ఫార్మసీ కాలేజీలు, ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కె.సొమ్లనాయక్, ఎన్.గంగాభవాని, కె.శ్రావణికుమారి, శ్రీహరి కోటి, జి.నీలిమ, పి.సూర్య ప్రకాష్ మహిళల అభ్యుదయ గీతాలు అలరించారు. పి.అనురాధ కవితలు వినిపించారు. గంగాభవాని, సరస్వతి రాఘవ శిష్య బృందం కుంగ్‌ఫు ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పి.ఆంజనేయులు, వి.సురేష్, ఉష, నళిని, వి.రాంకుమార్, డి.గణేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పి.దుర్గాప్రసాద్, వి.టాగూర్ రాజా, పవన్, టి.నాగయ్య పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : మాట్లాడుతున్న స్వరూపరాణి

ఏలూరు అర్బన్ : రోజురోజుకి మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, పాలకవర్గాలు చోద్యం చూస్తున్నాయే తప్ప అరికట్టలేకపోతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పేర్కొన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక పక్క మహిళలను ఆర్థికంగా బలపరుస్తున్నామని, సమాజంలో వారికి రక్షణ కల్పిస్తున్నామని పాలకవర్గాలు ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్నారని, ప్రతిరోజు పోలీసు స్టేషన్లలో నమోదవుతున్న అత్యాచారాల కేసులు మాట ఏంటని ప్రశ్నించారు. మహిళా దినోత్సవం రోజున వారికి అండగా నిలుస్తామన్నారు. స్త్రీ లేనిదే ఈ సృష్టి లేదని, మహిళ ఎక్కడ గౌరవించబడుతుందో ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని గొప్పలు చెప్పడానికి తప్ప ఆచరణలో మాత్రం నేటికీ మహిళలు అత్యాచారాలకు, అణచివేతనకు గురవుతునే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక చెడు మార్గంలో ప్రయాణించడం, సమాజంలో స్త్రీని ఆట వస్తువుగా చూడటం, ఇప్పటికీ మనుధర్మం వేళ్లను పూర్తిగా పెకలించకపోవడం ఈ పరిస్థితులకు కారణమని ఆయన భావించారు. మహిళలపై జరిగే దాదులకు కఠినమైన శిక్షలు విధించాలని, స్త్రీలు మరింత చైతన్యవంతులు కావాలని, ఆర్థికంగా, సామాజికంగా, అధికారికంగా పురుషులతో పాటు సమానంగా ఎదగాలని, అప్పుడే ఈ సమస్యల నుండి కొంతైనా మహిళలు బయటపడి ధైర్యంగా ఉంటారని అభిప్రాయపడ్డారు. మహిళలపై జరిగే అత్యాచారాలు, దాడులు ఎప్పుడు అరికట్టగలమో అప్పుడే మహిళలకు నిజమైన మహిళా దినోత్సవం వచ్చినట్లని ఆయన తెలిపారు.

ఉంగుటూరు : స్థానిక జనసేన కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో మహిళలను సత్కరించి వారి సేవలను అభినందించారు. అనంతరం కేకు కట్ చేశారు. 30 మంది పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

జీలుగుమిల్లి : సమాజాభివృద్ధిలో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారని పశు సంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.సాయిబుచ్చారావు అన్నారు. జీలుగుమిల్లిలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా ఐటిడిఎ పరిధిలో పని చేస్తున్న మహిళ పశు వైద్య సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశు సంపద ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. పశుగణాభివృద్ధిలో మహిళలు ప్రముఖ పాత్ర వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులైన మల్లంపల్లి గంగరాజు, చినతల్లి వారి జ్ఞాపకార్థం మహిళ సిబ్బందికి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎవివిలు సత్యనారాయణ, అబ్బులు, జెవిఒలు గౌరీ వరలక్ష్మి, రాజు, భవాని, పుష్ప పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : పట్టణంలో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని, వారి అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానని, రానున్న టిడిపి, జనసేన ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తామన్నారు. మాజీ కౌన్సిలర్ డాక్టర్ బొబ్బిలి ఝాన్సీరాణికి సన్మానం చేశారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి చెరుకూరి దుర్గాప్రసాద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యలమందల నాని, మహిళలు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు బోఫ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. విభిన్న రంగాలకు చెందిన మహిళలను సన్మానించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సంఘ సేవకులు మేతర అజయ్‌బాబు , ప్రముఖ విద్యారంగా సేవకులు పెరియర్ అంబేద్కర్ పూలే, బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విటల్ కుమార్, బోఫ్ కార్మిక విభాగపు నాయకులు దేవరపల్లి రత్నబాబు, కుమార్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుట్టాయగూడెం ప్రభుత్వాసుపత్రి వద్ద పిఒడబ్ల్యు ఆధ్వర్యంలో బహిరంగ సభ న్విహించారు. పిఒడబ్ల్యు డివిజన్ నాయకురాలు అలివేరు సర్పంచి కారం లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్ముల సురేష్, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి మాట్లాడారు. సభను ఉద్దేశించి ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ, పివైఎల్ నాయకులు తగరం బాబూరావు, ధర్ముల లక్ష్మీశ్రావణి మాట్లాడారు. అనంతరం బుట్టాయగూడెంలో మహిళలతో భారీ ప్రదర్శన చేశారు.

వైసిపి, జనసేన నాయకుల మధ్య ఘర్షణ

వీరిశెట్టిగూడెంలో ఘటన

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని వీరిశెట్టిగూడెంలో వైసిపి, జనసేన నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. జనసేన జెండా ఆవిష్కరణ విషయంలో ఇరు పార్టీల వారు వాగ్వివాదానికి దిగారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. వివరాల ప్రకారం... టిడిపి ఏలూరు పార్లమెంట్ నేత గోరుముచ్చు గోపాల్ యాదవ్, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, జనసేన చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య, జనసేన, టిడిపి కార్యకర్తలు కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో జనసేన పార్టీ జెండాలను ఆవిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని వీరిశెట్టిగూడెంలో ఈ నెల ఏడో తేదీ గురువారం సాయంత్రం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచి దేవరపల్లి రామ్మోహన్‌రావు, ఎంపిటిసి బొప్పన చైతన్య, గుర్రాల రవికుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన జనసేన జెండాను తొలగించాలన్నారు. దీనికి జనసేన నాయకులు నిరాకరించడంతో ఇరు పార్టీల నాయకులు ఘర్షన పడ్డారు. సమాచారం అందుకున్న తడికలపూడి స్టేషన్ పోలీసులు అక్కడికి వచ్చి ఇరు పార్టీ నాయకులను అక్కడి నుంచి పంపించేశారు. చింతలపూడి సిఐ రాజేష్ వీరిశెట్టిగూడెం వెళ్లి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బంది జనసేన పార్టీ జెండాను అక్కడి నుంచి తొలగించారు.

ఘర్షణ పడుతున్న వైసిపి, టిడిపి నాయకులు

టిడిపి, జనసేన నాయకుల తీరు దుర్మార్గం
ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ
జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్

గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే విధంగా జనసేన, టిడిపి నాయకులు వ్యవహరించిన తీరు దుర్మార్గమని ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ జిల్లా కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఇంటి వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో గెలవలేమనే ఒక అనుమానంతో సదరు జనసేన, టిడిపి నాయకులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. గ్రామాల్లో యుద్ధ వాతావరణం సృష్టించడం చాలా దుర్మార్గమన్నారు. జనసేన, టిడిపి నాయుకులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు చైతన్య, సర్పంచి దేవరపల్లి రామ్మోహన్‌రావు, ఉప సర్పంచి కేతా సత్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షులు పితాని గణపతి, ఉపాధ్యక్షులు భారతాల యుగంధర్, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'టిడిపితోనే ప్రజల అభ్యున్నతి'

ప్రజాశక్తి - మండవల్లి

తెలుగుదేశం ప్రభుత్వంతోనే అన్ని తరగతుల ప్రజల అభ్యున్నతి సాధ్యపడుతుందని ఆ పార్టీ నాయకులు కొడాలి వినోద్ అన్నారు. మండలంలోని కానుకొల్లులో డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావు విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మ పోరాట పాదయాత్రను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలను సన్మానించి కేక్ కట్ చేశారు.

గురునాధరావును కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఇటీవల కాంగ్రెస్ నుంచి వైసిపిలో చేరిన జెట్టి గురునాధరావును వైసిపి మండల కన్వీనర్ గురజాల పార్థసారధి, వైసిపి నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జంగారెడ్డిగూడెం మీడియా కో-ఆర్డినేటర్ చిప్పాడ వెంకన్న, వైసిపి మండల నాయకులు గంజి వినోద్, నేటి గణేష్ యాదవ్, నాని పాల్గొన్నారు.

కొయ్యలగూడెం డిగ్రీ క'ల'శాల

ప్రభుత్వాలు మారినా ముందుకు పడని అడుగు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీ

అధికారంలోకొచ్చాక విస్మరిస్తున్న వైనం

ఈసారైనా నిర్మించాలని ప్రజలు, విద్యార్థుల వేడుకోలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం అనగానే అందరికీ గుర్తుకొచ్చేది ఏజెన్సీ ముఖద్వారం. చుట్టు పక్కల గ్రామాలకు, మండలాలకు ఇదే వాణిజ్య రాజధాని. ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రదేశం, పోలవరం నియోజకవర్గానికి కొయ్యలగూడెం రాజకీయంగా ప్రధానమైన సెంటర్. ఇలాంటి ఎన్నో విశిష్టతలు కలిగిన కొయ్యలగూడేనికి 20 ఏళ్ల కల డిగ్రీ కళాశాల. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికి డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ అప్పటి నాయకుల చొరవ అంత ఆచరణీయంగా లేకపోవడంతో అది సాధ్యం కాలేదు. తరువాత రెండు రాష్ట్రాల వికేంద్రీకరణ జరిగిన తరువాత 2014 ఎన్నికల హామీల్లో తమ ప్రభుత్వం అధికారంలోకొస్తే డిగ్రీ కళాశాల నిర్మిస్తామని టిడిపి హామీ ఇచ్చింది. అధికారంలోకొచ్చాక ఆ హామీలో ఎలాంటి ముందడుగు పడలేదు. టిడిపి ప్రభుత్వం వల్ల సాధ్యం కాని హామీలన్నీ తమ ప్రభుత్వం వస్తే చేస్తామని జగన్ కొయ్యలగూడెం బహిరంగ సభలో హామీ ఇచ్చారు. 2019లో వైసిపి అధికారంలోకొచ్చి ఐదేళ్లవుతున్నా ఎలాంటి కదలిక లేదు. ఆ విషయంపై ఎలాంటి కార్యాచరణ జరగలేదు.

ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రతి నాయకుడు కొయ్యలగూడేనికి అనేక హామీలు ఇచ్చారు. అధికారంలోకొచ్చాక పట్టించుకున్న పాపాన లేదు. అన్ని పార్టీలు కలిసి సమీకృత ప్రణాళిక రచించకపోవడం వల్ల అది సాధ్యం కాని విషయంగానే మిగిలింది. కొయ్యలగూడెంలో డిగ్రీ కాలేజీ లేకపోవడం వల్ల విద్యార్థులు ప్రయివేట్ కళాశాలలో చేరాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రయివేట్ కళాశాలలు అంటేనే ఆర్థిక భారంతో కూడుకున్న వ్యవహారం. కొయ్యలగూడెంలో డిగ్రీ కాలేజీ మంజూరైతే రాజవరం, ఎర్రంపేట, కుంతలగుడెం, పొంగుటూరు, కన్నయ్యగూడెం, గవరవరం, గంగన్నగూడెం, కన్నాపురం ఏజెన్సీ, బయ్యన్నగూడెం అలాగే పక్క మండలాలు నల్లజర్ల, గోపాలపురం, బుట్టయగూడెం గ్రామాల్లో ఉన్న విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

జంగారెడ్డిగూడెంలో డిగ్రీ కాలేజీ ఉన్నా అది మున్సిపాలిటీ కావడంతో అక్కడ కేటాయించిన సీట్లలో దాదాపుగా ఆ చుట్టూ పక్కల గ్రామాల్లో ఉన్నవారికి దక్కుతున్నాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు నిరాశ మిగులుతుంది. సీట్లు దొరకకపోవడంతో విద్యార్థులు తాడేపల్లిగూడెం, రాజమండ్రి, నల్లజర్ల, ఏలూరు వంటి ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు. అవి కొయ్యలగూడెం మండలం నుంచి దాదాపుగా 20 నుంచి 50 కిలోమీటర్ల వరకు ఉండడంతో డైలీ సర్వీస్ చేసే విద్యార్థులు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ అధికార, విపక్ష నాయకులు వచ్చి అనేక హామీలు ఇస్తారు. ఈ సారైనా కొయ్యలగూడేనికి డిగ్రీ కాలేజీ సాధించుకునే ప్రణాళికలు తయారు చేసుకుని, అన్ని పార్టీ నాయకులు కలిసి పోరాడి కళాశాల నిర్మించేలా చూడాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

హామీలు తప్ప.. ఆచరణ లేదు
సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు

కొయ్యలగూడేనికి కళాశాల మండల ప్రజల 20 ఏళ్ల ఆకాంక్ష. 2014లో టిడిపి ప్రభుత్వం ఏర్పడితే కళాశాల నిర్మిస్తామని అప్పటి ఎంఎల్ఎ మొడియం శ్రీను హామీ ఇచ్చారు. కానీ ఎలాంటి చర్యలు లేవు. ప్రస్తుత వైసిపి ఎంఎల్ఎ తెల్లం బాలరాజు కూడా తమ ప్రభుత్వం ఏర్పడగానే కాలేజీ కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. నీటి బుడగలు, గాలి మాటలు తప్ప ఆచరణ సాధ్యంగా ఏమీ జరగలేదు. ఈ సారైనా పార్టీలకు అతీతంగా, కొయ్యలగూడెం డిగ్రీ కాలేజీ కల సాకారం చేసుకోవాలన్నారు.

కళాశాల ఏర్పడితే విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుంది
టిడిపి టౌన్ ప్రెసిడెంట్ జె.రామకృష్ణ

కొయ్యలగూడెం డిగ్రీ కాలేజీ కల సాకారం చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైంది. ప్రభుత్వం ఏర్పడగానే ఆరు నెలల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. మండలంలో ఉన్న పరిసర ప్రాంతాల నుంచి అనేక మంది విద్యార్థులు కొయ్యలగూడెం మండలకేంద్రంలో చదువుతున్నారు. డిగ్రీ కాలేజీ ఏర్పడితే ఈ చుట్టూపక్కల విద్యార్థులకు చాలా సౌలభ్యంగా ఉంటుంది. నారా లోకేష్ కొయ్యలగూడెం పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలో డిగ్రీ కాలేజీ అంశం మొట్టమొదటిది. మాకు ఇదే ప్రధాన అజెండాగా ఈసారి టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పడగానే పనులు మొదలుపెడతాం.

ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థులు
జనసేన మండలాధ్యక్షుడు తోట రవి

కొయ్యలగూడెం మండలానికి డిగ్రీ కాలేజీ తీసుకురాలేకపోవడం గత నాయకుల చిత్తశుద్ధికి తార్కాణం. ఎంఎల్ఎగా ఎన్నికైన తెల్లం బాలరాజు డిగ్రీ కాలేజీ తీసుకురాలేకపోవడం చాలా శోచనీయం. కొయ్యలగూడెం మండల కేంద్రం చుట్టూ అనేక మంది పేద విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ డిగ్రీ కాలేజీ వస్తే ఆ విద్యార్థులు పక్క నగరాలకు వెళ్లే అవసరం ఉండదు. జనసేన, టిడిపి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రధాన అంశంగా తీసుకుని డిగ్రీ కాలేజీ నిర్మాణ పనులు చేపడతాం.

2024లో వైసిపి రాగానే నిర్మిస్తాం
గంజిమాల రామారావు, ఎంపిపి, కొయ్యలగూడెం

కొయ్యలగూడెం డిగ్రీ కాలేజీ అంశం ఇప్పటిది కాదు. దాదాపుగా 20 ఏళ్లుగా ఉన్న ప్రతిపాదన. అయితే 2014లో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్మాణం చేపడతామని అప్పటి నాయకులు హామీ ఇచ్చారు కాని ఆచరణలో పెట్టలేదు. వైసిపి ప్రభుత్వం 2019లో ఏర్పడిన తర్వాత దాదాపుగా మూడేళ్లు కరోనాతో ఇబ్బంది పడిన సంగతి అందరికీ తెలిసిందే. టిడిపి ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చడం, ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడటానికి ప్రాధాన్యత ఇచ్చాం. 2024లో తమ ప్రభుత్వం ఏర్పడగానే సిఎం జగన్ ఆశీస్సులతో స్థానిక ఎంఎల్ఎ చొరవతో డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు కృత నిశ్చయంతో ఉన్నాం.

కళాశాల ఏర్పడితే చాలా ఉపయోగకరం
తాళ్లూరి చాందినీ, ఇంటర్ విద్యార్థిని, అంకలగూడెం

నేను కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. ఇక్కడ డిగ్రీ కాలేజీ ఉంటే మా లాంటి విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా సమయాభావం తగ్గుతుంది. మా గ్రామం దగ్గరగా ఉండటంతో, మహిళగా అనేక సమస్యలు నుంచి బయటపడవచ్చు.

చాలా సౌలభ్యంగా ఉంటుంది
శ్యామ్ దీపక్, ఇంటర్ విద్యార్థి, బొడిగూడెం

నేను ఇంటర్ సెకండియర్ చదువుతున్నాను. మా గ్రామం బొడిగూడెం. కొయ్యలగూడెం డిగ్రీ కాలేజీ ఏర్పడితే మా గ్రామానికి చాలా దగ్గరగా ఉంటుంది. దూరం వెళ్లాల్సిన అవసరం ఉండదు. దగ్గర ఉండటంతో చాలా సౌలభ్యంగా ఉంటుంది.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది.ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మిద్దె ప్రియాంక** W/o: **మిద్దె జోసేఫ్, వయస్సు** : 38సం॥లు, **నివాసం** : గనిజర్ల గ్రామం, చింతలపూడి మండలం, ఏలూరు జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఏలూరు జిల్లా, చింతలపూడి సబుడిలో చేరిన చింతలపూడి మండలం, గనిజర్ల గ్రామపంచాయితీ, గనిజర్ల రెవిన్యూ గ్రామం తాలూకు ఆర్.యస్. నెం.224-6 రు దాఖలా గనిజర్ల గ్రామంలోయున్న నాకు గల నీకు దఖలు పర్చిన 242.00 చ॥గ॥ = 200-86 చ॥మీ॥, **డాక్యుమెంట్** నెం. **4224/2024** గల నివేశన స్థలమునూ యి స్థలములో యున్న డోర్ నెం. 1-72 రు అసెస్మెంట్ నెం.72రు గల, 500 చ॥అ॥లు ప్లింత్ ఏరియా గల ఆర్‌సిసి వగేరాలకు హదులు :**తూర్పు**: గడిదేశి పెద వీరయ్య గారి ఇల్లు, **దక్షిణము** : దాసరి మేరి కుటుంబరావు గారి ఇల్లు, **పడమర** : పంచాయితీ రోడ్డు, **ఉత్తరం**: మిరియాల పోలేన గారి ఇల్లు.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది.ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **వేములపల్లి రవి ఓంకార్** S/o: **వేములపల్లి సత్యనారాయణ, వయస్సు** : 54సం॥లు, **నివాసం** : గోపాలపురం గ్రామం, ఎ.కొండూరు మండలం, ఎన్.టి.ఆర్.జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఎన్‌టిఆర్ జిల్లా, తిరువూరు సబ్ డి. ఎ.కొండూరు మండలం, గోపాలపురం గ్రామపంచాయితీ ఇలాకా పోలిశెట్టిపాడు రెవిన్యూ గ్రామములోని నాకు వున్నటువంటిన్నీ ఆర్.యస్.నెం.351/2బి 1ఏ దాఖలా నాకు హక్కు కలిగి మీకు క్రయపరుస్తున్న య. 0.06 సెంట్లుకు అయిన 290.4 చ॥గ॥, **డాక్యుమెంట్** నెం. **7757/2023** గల సరి అయిన 242.77 చ॥మీ॥ ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు**: నా తాలూకు అనగా తోటకూర రామారావు గారి స్థలం, **దక్షిణము** : తోటకూర భాస్కరరావు గారి స్థలం, **పడమర** : ఆర్ అండ్ బి రోడ్డు, **ఉత్తరం**: గ్రామపంచాయితీ రోడ్డు.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278